# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

Bullet Edition

శుక్రవారం, 9 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2 PM


## ప్రొఫైల్ పిక్‌గా జాతీయ జెండాను పెట్టుకోండి

### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ప్రజాస్వరం): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్రం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతి ఇంటి పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చింది. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్నందున హర్‌ఘర్‌తిరంగాను గుర్తిండిపోయే ఈవెంట్‌గా మార్చుకుందామంటూ ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. నేటి నుంచి ఆగస్టు 15 వరకు అందరూ తమ సోషల్ మీడియా అకౌంట్ల ప్రొఫైల్ పిక్‌ను మార్చాలని కోరారు. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి ఖాతాల డీపీలను త్రివర్ణ పతాకంతో మార్పు చేయాలని పిలుపునిచ్చారు. 'నేను నా ప్రొఫైల్ చిత్రాన్ని త్రివర్ణ పతాకంగా మార్చుకున్నాను. మీరు కూడా అలాగే చేయండి. జాతీయ జెండాలతో ఉన్న మీ సెల్ఫీలను https://harghartiranga.comలో షేర్ చేయండి' అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు.

### మనీశ్ సిసోదియాకు

## బెయిల్ మంజూరు

### ఢిల్లీ మద్యం కేసు.. సుప్రీంలో ఊరట



న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ప్రజాస్వరం): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోదియాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. రూ.10లక్షల వ్యక్తిగత పూచీకత్తు, ఆ మొత్తానికి ఇద్దరు ష్యూరిటీలతో ఆయనను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా కొన్ని షరతులు విధించింది. సిసోదియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసు (Delhi Excise Scam Case)లో గతేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పటి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోదియాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈడీ కూడా కస్టడీలోకి తీసుకుంది. అరెస్టయిన రెండు రోజుల తర్వాత మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి గత 17 నెలలకు పైగా ఆయన జైల్లోనే ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ కోరుతూ ఆ మధ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరు. కేసు విచారణలో పురోగతి లేకపోయినా.. ఒక పరిమితి దాటిన తర్వాత ఆ వ్యక్తిని జైల్లో ఉంచడం సరికాదు. అలాకాదంటే ఆ వ్యక్తి హక్కులను హరించడమే అవుతుంది. బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఉపశమనం పొందడం వారి హక్కు. 'బెయిల్ అనేది నియమం.. జైలు మినహాయింపు' అనే విషయాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



## తెలంగాణ..

### స్టేట్ ట్యాగ్ లైన్

# ఫ్యూచర్ స్టేట్



## ఇకపై అలాగే పిలుద్దాం

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు

### కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం

### కాలిఫోర్నియాలో ఏఐ బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ప్రజాస్వరం): ఇకపై మన తెలంగాణ రాష్ట్రాన్ని.. తెలంగాణ ఫ్యూచర్ స్టేట్ అని పిలుద్దామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయపదంగా నిలుస్తుందని అన్నారు. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్ లో టెక్ యునికార్న్స్ సీఈఓలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకోండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అని పిలుపునిచ్చారు.

'ఇప్పటి వరకు మేము న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్ లో పర్యటించాం. ఇప్పుడు కాలిఫోర్నియాలో ఉన్నాం. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉంది. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం. టెక్సాస్ ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు. కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదం ఉంది. మన దేశంలో రాష్ట్రాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాలేమీ లేవు. ఇప్పటినుంచి మన తెలంగాణ రాష్ట్రానికి అటువంటి ఒక లక్ష్య నినాదాన్ని ట్యాగ్ లైన్ గా పెట్టుకుందాం. ఇకపై మన రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్.. అని పిలుద్దాం..' అని సీఎం ప్రకటించారు. ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి డి.శ్రీధర్బాబు అన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యునికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు స్వయంగా హైదరాబాద్ ను సందర్శించాలని మంత్రి ఆహ్వానించారు. అక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు.

#### పెట్టుబడులకు అనుకూలం: శ్రీధర్ బాబు

ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యునికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు స్వయంగా హైదరాబాద్ ను సందర్శించాలని మంత్రి ఆహ్వానించారు. అక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు.

### రేషన్ కార్డుల జారీపై

## సబ్ కమిటీ

### సర్కార్ కీలక నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రజాస్వరం) : కళ్లు కాయలు కాసేలా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు కొత్త కార్డుల జారీకి సర్కార్ కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. కాగా, ఆ కమిటీకి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్ గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులతో సహా కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులపై సబ్ కమిటీ కలెక్టర్లతో కలిసి పూర్తిగా అధ్యయనం చేయనుంది. కొత్త రేషన్ కార్డుల జారీలో అవలంభించాల్సిన విధివిధానాలను కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలామంది నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నా వారికి నిరాశే ఎదురైంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొలుదీరాక ప్రజాపాలనలో భాగంగా లక్షలాది మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్ కార్డ్ ప్రామాణికం కావడంతో కొత్త రేషన్ కార్డులు

## బాలాపూర్‌లో రౌడీషీటర్ దారుణ హత్య

### అర్ధరాత్రి కాల్పుల మోత

హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రజాస్వరం) : ఓ రౌడీ షీటర్ దారుణ హత్యకు గురైన ఘటన గురువారం అర్ధరాత్రి బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. రియాజ్‌కు యాక్సిడెంట్ చేసిన దుంగడులు అనంతరం రివాల్వర్‌తో కాల్పులు జరిపి హతమార్చారు. బాలాపూర్ పోలీసుల కథనం మేరకు.. బాబానగర్ సీ-బ్లాక్‌కు చెందిన రియాజ్ అలియాస్ మెంటల్ రియాజ్ (45) కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రౌడీ షీటర్. గురువారం అర్ధరాత్రి బాలాపూర్ సమీప ప్రాంతం నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో అక్కడే మాటు వేసిన దుండగులు పథకం ప్రకారం గుర్తు తెలియని కారుతో రియాజ్ బైక్‌ను ఢీకొట్టారు. అతడు కింద పడిపోయిన వెంటనే ఒక్కసారిగా గుర్తు తెలియని వ్యక్తులు రివాల్వర్‌తో మూడు రౌండ్ల కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న బాలాపూర్ పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. స్పాట్‌లో కింద పడిన ఓ బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రియాజ్ ఛాతి, శరీరంలోని ఇతర భాగాలలో గాయాలు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. రియాజ్‌ను ఎవరు హతమార్చారు.. కారణం ఏంటనే విషాయాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## మంచి జరిగితే మాది.. చెడు జరిగితే మీది.. అంటే ఎలా?

### సుంకిశాల ప్రమాదంపై కేటీఆర్ స్పందన

హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రజాస్వరం) : సుంకిశాల ప్రాజెక్టు వద్ద ప్రమాదం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంచి జరిగితే మాది.. చెడు జరిగితే మీది.. అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అసత్య ప్రచారం చేస్తున్నదని అన్నారు. తెలంగాణ భవన్ లో పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ శుక్రవారం ఉదయం మాట్లాడారు. సుంకిశాల ఘటన అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఆగస్టు 2వ తేదీన జరిగిందని, అయినా దీనిపై ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటన చేయకుండా ఇన్నాళ్లు దాచిపెట్టిందని ఆరోపించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే నొక్కిపెట్టారా? లేక ఈ ప్రభుత్వానికి ఈ ప్రమాదం జరిగిన విషయం తెలియాదా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం పనులు ప్రారంభిచంటంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. అధికారులు చెప్పినా కూడా వినకుండా గేట్లు అమర్చటంతో ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని అన్నారు. బాధ్యతల నుంచి తప్పించుకొని గత ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటన్నారు. నీళ్ల విషయంలో కేసీఆర్ విజయాలను అంగీకరించలేని కురచమనస్తత్వంతోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.